క్లుప్తంగా

గ్రంథాలయాలు విజ్ఞాన బాంఢాగారాలు



గ్రంథాలయంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆదోనిఅర్బన్: పట్టణంలోని గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గ్రంథాలయాధికారిణి సుజాత ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. ఆదివారం మహిళా దినోత్సవం, భారత తొలి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారిణి మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ భారత తొలి మహిళా ప్రధానమంత్రిగా ఎదిగి ప్రపంచంలోనే మహోన్నతమైన స్త్రీమూర్తి అయ్యారన్నారు. జయాపజయాల వల్ల కుంగిపోక ఆదర్శ మహిళగా నిలిచారన్నారు. రికార్డు అసిస్టెంట్ దేవేంద్ర, మహిళలు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

శబరిమలకు చేరుకున్న అయ్యప్పమాలధారులు

ఆదోనిఅర్బన్: భక్తిపారవశ్యంతో ధర్మశాస్త దర్శనార్థం సైకిల్ యాత్ర చేపట్టిన అయ్యప్ప మాలధారులు శబరిమలలో కొలువైన అయ్యప్ప స్వామిని ఆదివారం దర్శించుకున్నట్లు గురుస్వామి రమేష్‌రెడ్డి, పంపారెడ్డి తెలిపారు. వారు మాట్లాడుతూ.. 17 సంవత్సరాలుగా అయ్యప్ప దీక్షను స్వీకరిస్తున్నామని చెప్పారు. ఈ నెల 10వ తేదీన ఆదోని అశ్వర్థ లక్ష్మినారాయణ ఆలయం నుంచి గురుస్వామి అయ్యన్న శిష్య బృందం నాగనాథనగురువు స్వామి ఆశీస్సులతో శబరిమలకు సైకిల్ యాత్రగా బయలుదేరినట్లు చెప్పారు. 10 రోజుల యాత్రలో కర్ణాటక, తమిళనాడు మీదుగా 880 కి.మీ ప్రయాణించి కేరళ రాష్ట్రంలోని సత్రానికి చేరుకున్నట్లు వివరించారు. అక్కడినుంచి పులిమేడు అడవి మార్గంలో పాదయాత్రగా బయలుదేరి కాలినడకన శబరిమలకు చేరుకున్నట్లు చెప్పారు. ఆదివారం శబరిగిరీషుడి దర్శనం చేసుకున్నట్లు తెలిపారు.

27న దీపోత్సవం



కరపత్రాలను విడుదల చేస్తున్న నిర్వాహకులు

ఆదోనిఅర్బన్: పట్టణంలోని అశ్వర్థ లక్ష్మినారాయణ స్వామి ఆలయంలో ఈనెల 27వ తేదీన జరిగే దీపోత్సవ కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు నాగరాజుగౌడ్ కోరారు. ఆదివారం ఆలయంలో కరపత్రాలను ఆలయ కమిటీ సభ్యులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పవిత్ర కార్తీక మాసంలో భక్తిశ్రద్ధలతో శివాలయాల్లో దీపారాధన చేస్తే సకల సంపదలు సిద్ధిస్తాయన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కల్లుమటం పీఠాధిపతి పూజ్యగురు సిద్ధేశ్వర స్వామిజీ పాల్గొని భక్తులకు మార్గదర్శనం చేయనున్నారు. భక్తులందరూ పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆలయ గౌరవ సలహాదారులు చెన్నబసప్ప, విశ్వనాథయ్య, బ్రహ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళకు పాముకాటు

తుగ్గలి: మండల పరిధిలోని పి.కొత్తూరుకు చెందిన సురేఖ ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఆదివారం తెల్లవారుజామున పాము కాటుకు గురైంది. గొంతు దగ్గర కట్ల పాము కాటు వేయడంతో వెంటనే కేకలు వేసింది. కుటుంబ సభ్యులు వెంటనే వచ్చి పామును గుర్తించి చంపేశారు. చికిత్స నిమిత్తం బాధితురాలిని అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు



మాళమల్లేశ్వర స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

హొళగుంద: రాష్ట్రంలో ప్రత్యేకత సంతరించుకున్న దేవరగట్టులో కార్తీక మాసం ఆదివారం స్వామివారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వరస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు జరిగాయి. ఆలయ ప్రధాన పూజారులు స్వామివారికి సుప్రభాత సేవ, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, పుష్పార్చన, మహామంగళారతి, ఆకుపూజ, నివేదన, నీరాజన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మాత మాళమ్మ, శివాసన కట్టకు పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. పలువురు భక్తులు గిరి పైవరకు ఉన్న 401 మెట్లకు బండారం పూసి, టెంకాయ కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదం పంపిణీతో పాటు ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్థానిక ఆస్పరి మఠంలో అన్నదానం చేశారు.

శివారు కాలనీలకు మహర్దశ

- శరవేగంగా రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం
- రూ.1.45 కోట్ల నిధుల మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న కాలనీల ప్రజలు

ఆదోని సెంట్రల్: పట్టణ శివారు కాలనీల్లో గతంలో సరైన రహదారులు, డ్రైనేజీ సౌకర్యం లేక అస్థవ్యస్థంగా ఉండేవి. ముళ్ల పొదలు, కంప చెట్లతో కాలనీ వాసుల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉండేది. శివారు కాలనీల్లో సైతం అభివృద్ధి పనులు చేపట్టేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంకల్పించింది.ఈ మేరకు 22వ వార్డు సచివాలయం పరిధిలోని కాలనీల్లో రహదారులు, డ్రైనేజీల నిర్మాణం కొరకు అధికారులు ప్రణాళికలను సిద్ధం చేసి పంపారు. స్పందించిన ప్రభుత్వం డ్రైనేజీల నిర్మాణ పనులకు నిధులను మంజూరు చేసింది. విజయభాస్కర్ రెడ్డి కాలనీలో డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టేందుకు ప్రభుత్వం రూ.1.45 కోట్ల నిధులను మంజూరు చేసింది. భీమ్ రెడ్డి కాలనీలో డ్రైనేజీ పనులకు రూ.67 లక్షలు, వైఎస్సార్ నగర్ కాలనీలో డ్రైనేజీ పనులకు రూ.11 లక్షలు, కాలనీల నుంచి డ్రైనేజీ వ్యవస్థను మెయిన్ డ్రైనేజీకి అనుసంధానం చేసే పనులకు రూ.43 లక్షల నిధులను విడుదల చేసింది. దీంతో అధికారులు ఆయా కాలనీల్లో డ్రైనేజ్ నిర్మాణ పనులు చేపట్టారు.

పిచ్చి మొక్కలు, ముళ్ల కంపలతో రహదారులు

గతంలో ఆయా కాలనీలో రహదారులు అస్థవ్యస్థంగా ఉండేవి. ఏ ఇల్లు ఎక్కడి వరకు హద్దు ఉందో తెలియని పరిస్థితి. రహదారుల వెంబడి పిచ్చి



ఆదోనిలో కొనసాగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులు

మొక్కలు, ముళ్ల కంపలు మొలిచి రాకపోకలకు అంతరాయంగా ఉండేది. మురుగు నీళ్ల ఇళ్ల ముందు నిలిచి దోమలు, క్రిమికీటకాలతో పాటు కాలనీవాసులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందికరంగా ఉండేది. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం డ్రైనేజీల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో అధికారులు పనులను ప్రారంభించేలా చర్యలు చేపట్టారు. ముళ్ల కంపలు, పిచ్చి మొక్కలను తొలగించి పనులను ప్రారంభించారు. కాలనీల రహదారు



చేపట్టిన డ్రైనేజీ పనులు

లకు ఒక రూపం వచ్చింది. ఇళ్ల హద్దులు కూడా ఏర్పడ్డాయి. కాలనీవాసుల రాకపోకలకు ఇబ్బందులు తొలగిపోయాయి. అలాగే కాలనీలోని మురుగు నీరంతా ఒక చోటకు చేర్చి అక్కడ నుంచి మెయిన్ డ్రైనేజీ కాలువకు చేరే విధంగా పనులు చేపడుతున్నారు. పేదలు, మధ్య తరగతి వారు నివసించే కాలనీలు కూడా ప్రజలకు సౌకర్యవంతంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం కాలనీల అభివృద్ధికి నిధులను మంజూరు చేసి పనులు చేపడుతోంది.

రహదారులు అస్తవ్యస్తంగా ఉండేవి



గతంలో కాలనీలో సరైన రహదారులు లేక ఇబ్బందులు పడ్డాం. రహదారుల వెంబడి పిచ్చిమొక్కలు, ముళ్ల కంపలు మొలచి అస్థవ్యస్థంగా ఉండేది. మురుగు నీరు వెళ్లేందుకు డ్రైనేజీ లేకపోవడంతో ఇబ్బంది పడేవాళ్లం. ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో అధికారులు పిచ్చి మొక్కలు, ముళ్ల కంపలను తొలగించి డ్రైనేజీ నిర్మాణ పనులు చేస్తున్నారు. దీంతో రహదారులకు ఒక రూపం వచ్చింది. కాలనీ వాసుల రాకపోకలకు సౌకర్యవంతంగా మారింది.

– మహేశ్, వైఎస్సార్ కాలనీ, ఆదోని

వేగంగా డ్రైనేజీ నిర్మాణ పనులు



ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో ఆయా కాలనీల్లో డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టాం. కాలనీలోని రహదారుల హద్దులను గుర్తించి ప్రణాళిక ప్రకారం పనులు చేయిస్తున్నాం. అక్కడక్కడ రహదారుల నిర్మాణం పూర్తి చేశాం. డ్రైనేజీలు లేని చోట నిర్మాణ పనులు చేపట్టాం. కాలనీల్లో రహదారుల నిర్మాణాలకు ఎస్టిమేట్ తయారు చేసి అధికారులకు పంపాం. నిధులు మంజూరైతే ఆ పనులు కూడా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. – నాగరాజు, ఇంజినీరింగ్ అసిస్టెంట్, 22వ వార్డు సచివాలయం, ఆదోని

నేడు గ్రామసభ

కౌతాళం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి సామాజిక తనిఖీలో భాగంగా సోమవారం కౌతాళంలో గ్రామసభ నిర్వహించనున్నట్లు సర్పంచ్ పాల్‌దినకర్ తెలిపారు. 2022–23 సంవత్సరానికి సంబంధించి సామాజిక తనిఖీ బృందం వారు ఆడిట్ చేయడం జరుగుతుందని ఇందులో భాగంగానే సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సభ ఉంటుందన్నారు. గ్రామ ప్రజలు, ఉపాధి కూలీలు పాల్గొనాలని కోరారు.

22 నుంచి పరదేశప్ప తాత ఆరాధనోత్సవాలు

ఆస్పరి: మండలంలోని అట్టికల్లు గ్రామంలో ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు పరదేశప్ప తాత (అంగయ్యన్ తాత) 13వ ఆరాధనోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. ఈ నెల 22వ తేదీన తాత సమాధికి ప్రత్యేక పూజలు, 23న పల్లకీ, నందికోలు సేవ, 24న ప్రత్యేక పూజలు, తాత చిత్రపటం ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

రాష్ట్రస్థాయి భజన పోటీలు

అట్టికల్లు గ్రామంలో పరదేశప్ప తాత ఆరాధనోత్సవాల సందర్భంగా ఈ నెల 23వ తేదీన రాష్ట్రస్థాయి భజన పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి 1 నుంచి 10వ బహుమతులు వరుసగా రూ.12,600, రూ. 9,999, రూ.8,100, రూ.7,200, రూ.6,300, రూ.5,400, రూ.4,500, రూ.3,600, రూ.2,700, రూ.1,800 నగదు అందించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల భజన బృందాలు రూ.300 ఎంట్రీ ఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని కోరారు. ఉత్తమ హార్మోనిస్టు, తబలిస్టు, గాయకుడికి ప్రత్యేక బహుమతులు అందించనున్నట్లు చెప్పారు. వివరాలకు సెల్ 91779 49327, 96765 83657లను సంప్రదించాలన్నారు.

భూగేని చెరువుకు చేరిన నీరు

కోసిగి: మండల ప్రజల తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చేపట్టిన పులికనుమ పైప్‌లైన్ నుంచి భూగేని చెరువుకు నీటి సరఫరా ప్రక్రియ సక్సెస్ అయ్యింది. ఈనెల 15వ తేదీన ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, గురురాఘవేంద్ర ప్రాజెక్టు అధికారులతో కలిసి పైప్‌లైన్ నుంచి నీటి సరఫరా ట్రయల్ చేపట్టారు. దీంతో భూగేని చెరువులోకి నీరు చేరుకున్నాయి. మండల ప్రజలకు తాగునీటి సౌకర్యార్థం ఎమ్మెల్యే సొంత నిధులు రూ.40 లక్షలు వెచ్చించి మరమ్మతులు చేయించారు. చెరువులో 6 క్యూసెక్కుల నీటి సామర్థ్యం ఉందని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ఓపెన్ కాలువ ద్వారా చెరువులో నీటి సరఫరా ప్రక్రియ చేపట్టారు. త్వరలోనే పైప్‌లైన్ నుంచి చెరువు వరకు 1.5 కిలోమీటర్ల పైప్‌లైన్ వేయించి అండర్‌గా చెరువులోకి చేరేలా పనులు చేయిస్తామన్నారు.



ఓపెన్ కాలువ ద్వారా చెరువులోకి ప్రవహిస్తున్న నీరు

పైప్‌లైన్ పనులు పూర్తయిన వెంటనే ఫిల్టర్ బెడ్స్ ఏర్పాటు చేయిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం నీరు చెరువుకు చేరుతుండడంతో కోసిగి ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. తాగు, సాగునీటి సమస్య పరిష్కారం అవుతుండడంతో ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి



క్రీడాకారిణులతో నాయకులు, ఉపాధ్యాయులు

కౌతాళం: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు వీరభద్రగౌడ్ అన్నారు. మండల పరిధిలోని బదినేహాల్ జెడ్పీ పాఠశాల ఆవరణలో అండర్–14 బాలికల ఖోఖో శిక్షణ శిబిరాన్ని ఆయన ఆదివారం సర్పంచ్ పెద్ద నర్సన్న, ప్రధానోపాధ్యాయుడు హరినాథ్‌రావులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలికలు చదువులతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. క్రీడల్లో రాణిస్తే మంచి ఉద్యోగాలు పొందవచ్చన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడుతాయని ఆటపోటీల వల్ల శారీరక దారుఢ్యం మెరుగుపడుతుందన్నారు. ప్రధానోపాధ్యాయుడు హరినాథ్‌రావు మాట్లాడుతూ.. ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించి 15 మంది క్రీడాకారిణులు కోచింగ్ క్యాంపులో పాల్గొంటున్నారని తెలిపారు. ఇక్కడ వారం రోజుల కోచింగ్ అనంతరం ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు గుంటూరు జిల్లా నరసరావుపేటలో జరిగే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొంటారన్నారు. బదినేహాల్ పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థినులు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొంటున్నట్లు చెప్పారు. ఎస్ఎంసీ చైర్మన్ మాలింగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

28న హిందూ ధర్మ సమ్మేళనం

ఆలూరు: ఆలూరు గ్రామానికి రెండు కి.మీ దూరంలో ఉన్న బెళ్లగుండ ఆంజనేయస్వామి దేవాలయం, కోట వీధిలో కొలువుదీరిన భీమ లింగేశ్వర స్వామి ఆలయాల్లో ఈ నెల 28వ తేదీన హిందూ ధర్మ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు పండితులు, పంచాగకర్త రవిశాస్త్రీ స్వామి, గవిసిద్దయ్య స్వామి ఆదివారం ఓ ప్రకటనను విడుదల చేశారు. అదే విధంగా ఉపాధ్యానగర్ కాలనీలో సాయిబాబా మందిరంలో హిందూ ఆత్మీయ సమ్మేళనం, అనంతరం కార్తీక వన భోజనాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన కోగిలతోట గ్రామస్తులు

ఆలూరు: పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. స్థానిక మంత్రి నివాసంలో ఆదివారం రాత్రి 8 గంటలకు హొళగుంద మండలం కోగిలతోట గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు యాట చంద్రప్ప, చిన్న బసప్ప, తిమ్మప్ప, సుంకన్న మరో 30 కుటుంబాల వారు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి మంత్రి జయరాం పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ పాలనలో వివక్ష లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అందిస్తున్న జనరంజక పాలనను చూసి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారన్నారు. మాజీ సీఎం చంద్రబాబునాయుడు భవిష్యత్తుకే గ్యారంటీ లేదని, బెయిల్ గడువు ముగిసిన తర్వాత ఆయన జైలుకు వెళ్లాల్సిందేనని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, శేషప్ప, వన్నూరప్ప తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా గాంధీకి ఘననివాళి



ఆదోనిలో ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆదోనిటౌన్: భారతదేశ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ గోవిందరాజులు, సీనియర్ నాయకుడు హోటల్ హనుమంతు, మేస్త్రీ కృష్ణ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ జయంతి వేడుకలను జరుపుకున్నారు. ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో భారతదేశం అన్నివిధాలా అభివృద్ధి చెందేలా కృషి చేశారన్నారు. పేదలకు సంక్షేమ పథకాలను అందించి ఆర్థికంగా ఎదిగేలా ప్రోత్సహించారన్నారు. ఆమె ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు చలపతి, తాయప్ప, లక్ష్మన్న, రఘురామ్, కరెంట్ శీను, హనుమంతు, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదోనిరూరల్: దేశ మొదటి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ జయంతి కార్యక్రమాన్ని పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదోని కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బి.నీలకంఠప్ప మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల వారు ఆర్థికంగా ఎదిగేలా భూ పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు నిర్మించిందన్నారు. నిరుపేదలకు కూడు, గుడ్డ, నీరు, ఇల్లు అందించాలనే ఉద్దేశంతో గరీబ్ హటావో అనే నినాదం తీసుకురావడం జరిగిందన్నారు. ఆమె సేవలు మరువలేనివని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ కార్యనిర్వహణ అధ్యక్షుడు దిలీప్‌దోకా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువజన కార్యదర్శి మారుతిరావు, సెక్రటరీ సాయినాథ్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమావేశాలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు

ఆదోనిరూరల్: డిసెంబర్ 15, 16, 17వ తేదీల్లో కర్నూలులో జరగనున్న ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె.వెంకటేశులు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆదోని మండల ప్రజా సంఘాల కార్యకర్తల సమావేశాన్ని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లింగన్న ఆధ్వర్యంలో మండలంలోని పాండవగల్లు పాతూరు ఆంజనేయస్వామి దేవాలయం వద్ద నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. వర్షాభావంతో నష్టపోయిన ఆదోని మండలాన్ని తీవ్రస్థాయి కరువు మండలంగా ప్రకటించాలని, కరువు సహాయక చర్యల్లో భాగంగా ఎకరానికి రూ.50 వేలు చొప్పున పంట నష్టపరిహారం అందించాలన్నారు. ఇప్పటికే గ్రామాల్లో చేయడానికి పనులు లేక వేలాదిమంది తెలంగాణ, కర్ణాటక ప్రాంతాలకు వలసబాట పట్టారని, గ్రామాల్లో తక్షణమే ఉపాధి పనులు 200 రోజులు కల్పించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు శేఖర్, అయ్యప్ప, సీఐటీయూ నాయకులు బి.రామాంజనేయులు, బి.వీరారెడ్డి, కేవీపీఎస్ నాయకులు మునిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవానికి సిద్ధం





ప్రారంభానికి సిద్ధంగా ఉన్న రైతు భరోసా కేంద్రం,కామవరంలో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం

కౌతాళం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామాల్లో ప్రజల ముంగిటకే సేవలు అందించాలన్న లక్ష్యంతో గ్రామాలలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేస్తోంది. ఆయా కార్యాలయాలకు పక్కా భవనాలు నిర్మించేందుకు తగినన్ని నిధులు మంజూరు చేసింది. ఇందులో భాగంగానే ప్రతి గ్రామంలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ భవనాలు శరవేగంగా నిర్మితమవుతున్నాయి. మండల పరిధిలోని కామవరం గ్రామంలో సచివాలయ భవనాన్ని రూ.40 లక్షలతో, రైతు భరోసా కేంద్రాన్ని రూ.21.80 లక్షలతో నిర్మించారు. ఈ భవనాలు పూర్తి కావడంతో త్వరలోనే ప్రారంభిస్తామని పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఎరిగేరి గ్రామంలోనూ సచివాలయం భవనం పూర్తయ్యిందని త్వరలోనే ప్రారంభిస్తామని ఆయన వివరించారు.

వేగంగా సచివాలయ నిర్మాణం

కోసిగి: మండల పరిధిలోని సజ్జలగుడ్డం గ్రామంలో సచివాలయ నూతన భవన నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రభుత్వం ప్రతి గ్రామ సచివాలయ నిర్మాణానికి రూ.43.50 లక్షల నిధులు కేటాయించింది. మండలంలో 19 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ఇప్పటివరకు మండలంలోని కోసిగి–4, దుద్ది, పెద్దభూంపల్లి, గ్రామాల్లో నూతన కార్యాలయ భవనాలను ప్రారంభించారు. మిగిలిన గ్రామాల్లో భవన నిర్మాణాలు చివరి దశకు చేరుకున్నాయి. త్వరలోనే అన్ని భవనాల నిర్మాణం పూర్తి చేసి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.



సజ్జలగుడ్డంలో నిర్మాణంలో ఉన్న గ్రామ సచివాలయ భవనం

మౌలిక వసతులు కల్పించండి

నందవరం: ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ, పీఎస్‌యూ విద్యార్థి సంఘాల నాయకులు రంగప్ప, సురేష్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను విద్యార్థి సంఘాల నాయకులు పరిశీలించి, విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హాస్టల్‌లో దాదాపు 200 మంది విద్యార్థులు ఉన్నారని, వారికి సరైన మెనూ పాటించకుండా నాణ్యత లేని భోజనం అందిస్తున్నారని పేర్కొన్నారు. హాస్టల్‌లో మెనూ ప్రకారం భోజనం అందడం లేదన్నారు. అలాగే విద్యార్థులకు తగిన సౌకర్యాలు స్నానపు గదులు, మరుగు దొడ్లు, ట్యూబ్ లైట్లు, ఫ్యాన్లు, తాగునీరు వంటి వసతులు కల్పించాలని కోరారు. ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా అధికారులు మాత్రం సౌకర్యాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు హాస్టల్‌ను సందర్శించి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

భారీ వాహనాలతో పొంచిఉన్న ముప్పు

హొళగుంద: నిబంధనలు అతిక్రమించి భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో ఎల్లెల్సీ, వేదావతి (హగరి) నదిపై నిర్మించిన బ్రిడ్జిలు దెబ్బతింటున్నాయి. ఆంధ్ర–కర్ణాటక రాష్ట్రాలకు రాకపోకలకు అనువుగా ఉన్న బ్రిడ్జిలకు భారీ వాహనాల వల్ల ముప్పు ఏర్పడుతోందని ప్రజలు వాపోతున్నారు. ఎల్లెల్సీపై 1947లో బ్రిడ్జి నిర్మించారు. బ్రిటీష్ కాలం నాటి వంతెనకు ప్రమాదం పొంచి ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వాహనాలు వెళ్లేటప్పుడు బ్రిడ్జి నుంచి వింత శబ్దాలు వినిపిస్తున్నాయి. కంకర, సిమెంట్ నల్లబండలు, ఇసుక వాహనాలు హెవీ లోడులతో తిరగడం వల్ల బ్రిడ్జిలు దెబ్బతింటున్నాయి. ఎల్లెల్సీ బ్రిడ్జిపై దాదాపు 8 టన్నులు, వేదావతి (హగరి) బ్రిడ్జ్ 15 టన్నుల బరువున్న వాహనాల సామర్థ్యాన్ని తట్టుకునేలా వంతెనలు నిర్మించారు. అయితే 30 టన్నులకు పైగా బరువున్న వాహనాలు తిరగడం వల్ల బ్రిడ్జిలు పటిష్టత కోల్పోతున్నాయి. ఇప్పటికే బ్రిడ్జిలు దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి. అధికారులు స్పందించి దెబ్బతిన్న వంతెనలపై భారీ వాహనాల రాకపోకలు నియంత్రించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



మార్లమడికి మార్గంలో వెళుతున్న భారీ వాహనాలు

ముమ్మరంగా రీసర్వే

కౌతాళం: మండలంలో రీసర్వే పనులను ముమ్మరంగా చేపట్టినట్లు తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి తెలిపారు. మొదటి విడతలో ఇప్పటికే ఆరు గ్రామాల్లో రీసర్వే పూర్తయ్యిందని, రెండవ విడతలో మండలంలోని తోవి, బాపురం, బంటకుంట గ్రామాల్లో సర్వే పూర్తయ్యిందని వివరించారు. సుళేకేరి, కాటేదొడ్డి, కామవరం గ్రామాల్లో గ్రౌండ్ లెవల్ సర్వే పూర్తయ్యిందని జేసీ లెవల్‌లో పెండింగ్‌లో ఉందన్నారు. అలాగే కాత్రికి, డంబలదిన్నె, అగసలదిన్నె గ్రామాల్లో పనులు గ్రౌండ్ లెవల్‌లో జరుగుతున్నాయని మరో వారంలోపు ఈ పనులు పూర్తి అవుతాయన్నారు. రీసర్వే వల్ల రైతులకు కలిగే మేలును వివరించారు.



కామవరంలో రీసర్వే గురించి తెలుసుకుంటున్న రైతులు